క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. దక్షిణాయనం పుష్య మాసం ఆశ్లేష నక్షత్రం విదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు 10వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

చీరాల: పట్టణంలోని 10వ వార్డులోని థామస్‌పేట సచివాలయం పరిధిలో సోమవారం సాయంత్రం 4గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొంటారని క్యాంప్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

నేడు పర్చూరు మార్కెట్ యార్డులో సమావేశం

పర్చూరు: పర్చూరు మార్కెట్ యార్డులో 9వ తేది సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ నెల 13వ తేదీన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ నియోజకవర్గానికి మొదటిసారిగా వస్తున్నందున విధివిధానాలపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పీ సుశీలాదేవి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. స్పందనకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు.

మల్లాయపాలెంలో పొట్టేళ్ల పోటీలు

బల్లికురవ: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో 14వ తేదీ శనివారం గొర్రె పొట్టేళ్ల పందెపు పోటీలు, ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో ప్రథమ బహుమతిగా 20 వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు, నాలుగో బహుమతిగా రూ. 5 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. వివరాలు 63024 77177 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

పోలియో నివారణకు రోటరీ క్లబ్ సాయం



చెక్‌డ్యాం పరిశీలిస్తున్న రోటరీ గవర్నర్

పర్చూరు: రోటరీ క్లబ్ పోలియో రహిత సమాజం కోసం పని చేస్తోందని రోటరీ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో రోటరీ గవర్నర్ రాజశేఖరరెడ్డి అధికారిక పర్యటనలో భాగంగా పర్చూరు, నూతలపాడు గంగ, చెక్‌డ్యాం, పబ్లిక్ టాయిలెట్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోశాధికారి కాసా అశోక్, రోటరీ సభ్యులు కెఎస్సార్కే ప్రసాద్, భవనం రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరుల సేవలోనే ఆనందం



పాతమల్లాయపాలెంలోని ఆర్వో ప్లాంట్



మినీ ట్యాంకు నుంచి నీరు పట్టుకుంటున్న మహిళ



పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు..

- తండ్రి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు
- రూ. 40 లక్షలతో గ్రామంలో ఆర్వో ప్లాంట్, ఆరు మినీ ట్యాంకులు, రోడ్లు
- సేవా కార్యక్రమాలతో శభాష్ అనిపించుకుంటున్న చంద్రశేఖర్

బల్లికురవ: మానవ సేవే మాధవ సేవ అన్నారు. మనకు ఉన్న దాంట్లో కొంచెమైనా దానం చేయాలని పూర్వీకుల చెప్పుంటారు. సంపాదించిన సొమ్ములో కొంత మొత్తాన్ని గ్రామాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు వెచ్చించాలన్న తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు దూసుకెళ్తున్నాడు ఓగ్రానైట్ వ్యాపారి. రూ. 40 లక్షలతో పలు కార్యక్రమాలు చేపట్టి శభాష్ అనిపించుకుంటున్నాడు. మండలంలోని పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దపాటి చంద్రశేఖర్ (శంకర్) గ్రానైట్ మార్కర్‌గా మూడేళ్లుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి రామయ్య ఇచ్చిన స్ఫూర్తితో గ్రామంలోని సమస్యలు తీరుస్తూ అభివృద్ధికి పాటు పడాలని భావించారు. 2021 డిసెంబర్ 26న తండ్రి అనారోగ్యంతో చనిపోయారు. అనుకున్నదే తడవుగా గ్రామంలో ఆర్వో ప్లాంట్, ఆరు మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలి ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలు, ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ట్యాంకులు, కుళాయిలకు నిరంతరంగా నీటిని ఉచితంగా అందిస్తున్నారు. ఇటీవలే శంకర్ ఆధ్వర్యంలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య సమక్షంలో 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు.

పొలాలు బాటలు, బోర్ల ఏర్పాటు...

గ్రామం నుంచి ఉప్పుమాగులూరు వెళ్లే పొలాల రోడ్డు అధ్వానస్థితికి చేరి గోతులేర్పడ్డాయి. రైతులు, వ్యవసాయ కూలీలు, పొలాలకు వెళ్లాలన్నా, పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితులను తెలుసుకున్న శంకర్ రూ.2 లక్షలతో రోడ్డు అభివృద్ధి పరిచి గ్రావెల్ తోలించారు. పొలాలకు వెళ్లిన రైతులు మంచినీటికి పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని బోరు ఏర్పాటు చేశారు.

పింఛన్ల పంపిణీ...

తండ్రి రామయ్య సంవత్సరీకం సందర్భంగా గ్రామంలో వివిధ రకాల పింఛన్‌లు పొందుతున్న 225 మందికి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ నగదుకు అంతే మొత్తాన్ని కలిపి పంపిణీ చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించటంలో విశేష కృషి చేస్తున్న ఎనిమిది మంది వలంటీర్ల సేవలను గుర్తించి ఒక నెల జీతాన్ని బోనస్‌గా అందజేశారు. గ్రామస్తులు శంకర్ చేస్తున్న సేవా కార్యకమాలను అభినందించారు.

మంచినీరు అందించటం ఆనందంగా ఉంది..



సురక్షిత మంచినీరు లేక అనారోగ్యం బారినపడుతున్న తమను గుర్తించి ఆర్వో ప్లాంట్, మినీ ట్యాంకుల ద్వారా నిరంతరంగా మంచినీరు అందిచటం సంతోషంగా ఉంది. గ్రామాభివృద్ధికి శంకర్ విశేషంగా కృషి చేస్తున్నారు.

–కోవూరి పున్నారావు, గ్రామస్తుడు

నావంతు బాధ్యతగా సేవ చేస్తున్నా..



కేవలం ప్రభుత్వమే మేలు చేయాలని కాదు. మనవంతు బాధ్యతగా ఎంతోకొంతలో అభివృద్ధి చేయడానికి పూనుకోవాలి. గ్రామంలోని ప్రధాన సమస్యలను గుర్తించాం. సర్పంచ్ జూపల్లి రాఘవరావు, మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య ఆశీస్సులతో దశలవారీగా గుర్తించిన సమస్యలను తీర్చి గ్రామాభివృద్ధికి పాటు పడతాను.

– ముద్దపాటి చంద్రశేఖర్

ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వీడాలి

- ఎమ్మెల్యే కరణం బలరాం



ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల టౌన్: అధికారులు అలసత్వాన్ని వీడి త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేయించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సూచించారు. ఆదివారం మండలంలోని చీరాలనగర్–1,2 జగనన్న లేఅవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు ఎమ్మెల్యే పరిశీలించారు. చీరాల నగర్–1లో 284, చీరాల నగర్–2లో 322 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. రెండు లేఅవుట్లలో కేటాయించిన ఇళ్లు, నిర్మాణ దశలను అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. లేఅవుట్లలో నిర్మాణ పనులు ఎందుకు జాప్యం జరిగిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో నిర్మాణాలను నెలాఖరులోపు పూర్తి చేసి లబ్ధిదారుల చేత గృహ ప్రవేశాలు చేయించాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. అధికారులు ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు కావాల్సిన ప్రభుత్వం సాయం, బ్యాంకు రుణాలు త్వరగా అందించేందుకు కృషి చేయాలన్నారు. అలానే వాడరేవు రోడ్డులోని కుందేరుకు ఇరువైపులా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, ఎంపీడీవో నేతాజీ, హౌసింగ్ డీఈ గోవిందరెడ్డి, ఏఈ శ్రీనివాసులు, మున్సిపల్ కౌన్సిలర్ బి.అనీల్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా



కృష్ణమోహన్‌కు పూలమొక్క అందజేస్తున్న జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల అధ్యక్షుడు రామయ్య

- నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి

పర్చూరు/మార్టూరు/చినగంజాం: నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం పందిళ్లపల్లిలోని ఆమంచి నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు, టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు, దివ్యాంగులు ఆమంచిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య, దివ్యాంగ నాయకులు సైకం ఏడుకొండలు, షేక్ అమీర్‌బాషా, రాసాని నాగరాజు, అసోది అంకిరెడ్డి, దేవరపల్లి సర్పంచ్ లాజరు, ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్, కె.నాగేశ్వరరావు, జ్యోతి, మార్కు, రోశయ్య, దేవరపల్లి కార్యకర్తలు, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా సురేష్, రాష్ట్ర కౌన్సిలర్, హరిప్రసాద్, గుమ్మా లక్ష్మీనారాయణ, షేక్ బాజీవలి, చెరుకూరు, కొల్లావారిపాలెం ఎస్సీ కాలనీ నాయకులు పాల్గొన్నారు.



ఆమంచిని కలిసి అభినందనలు తెలుపుతున్న మార్టూరు నాయకులు

ఆమంచి కృష్ణమోహన్‌ను మార్టూరుకు చెందిన పలువురు అధికారులు, పార్టీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఏడీఈ గురవయ్య, యద్దనపూడి ఏఈ శ్రీనివాసరావులు, మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, అట్లూరి సుకుందరావు, మస్తాన్‌వలి అభినందనలు తెలియజేశారు.

కారంచేడు: ఆమంచి కృష్ణమోహన్‌ను ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. కొడవలివారిపాలెం గ్రామ సర్పంచ్ కొడాలి మోహనకృష్ణ, బీసీ నాయకుడు వెంపరాల సుబ్బారాయుడు అభినందనలు తెలిపారు.

క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య, గరటయ్య

జే.పంగులూరు: గ్రామీణ వాతావరణంలో టీ–20 క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రిష్ణచైతన్యాస్ కొండమంజులూరు క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లు పోటీలు ప్రారంభించారు. ఈపోటీలను కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే గరటయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ పోటీలు ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించన్నుట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కొరిశపాడు మాజీ జెడ్పీటీసీ బాచిన చెంచు ప్రసాద్, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆర్ వెంకటసుబ్బారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ జంపాని రవిబాబు, సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ సుప్రియ రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు వెంకన్నబాబు, నాయకులు జంపాని రాజ, నాయకులు గాదే బ్రహ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు

వేటపాలెం: స్థానిక వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ రోడ్డు, ఆంధ్రాబ్యాంకు రోడ్డులో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు దోగుపర్తి బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బంపర్ బహుమతి రిఫ్రిజిరేటర్, మొదటి బహుమతి మిక్సర్ గ్రైండర్, రెండో బహుమతి ప్రెజర్ కుక్కర్, మూడో బహుమతి ఎలక్ట్రికల్ కెటిల్, పది మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తారని చెప్పారు. వివరాలకు 8688 612005, 81431 59794 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

13న ఇంకొల్లులో ముగ్గుల పోటీలు..

చినగంజాం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 13 వతేదీ ఇంకొల్లులోని సాయిబాబా గుడిరోడ్‌లో మహిళలకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని పూర్ణారావు, కోశాధికారి బైసాని నరసింహం శెట్టి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.4116, రూ.3116, రూ.2116, రూ.1116లు తో పాటు ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు కార్యదర్శి దోగిపర్తి బదరీనారాయణ 96761 85236 నంబర్ సంప్రదించాలని సూచించారు.

ఘనంగా తిరుప్పావై సేవ



పులిహోర, డ్రై ఫ్రూట్స్ అలంకరణలో వేంకటేశ్వరస్వామి

వేటపాలెం: ధనుర్మాసం సందర్భంగా వివిధ వైష్ణవాలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. రామన్నపేట పంచాయతీ పరిధిలోని రావూరిపేట చెన్నకేశవ స్వామి దేవస్థానంలో తిరుప్పావై సేవ నిర్వహించారు. వంద కేజీల పులిహోర, డ్రై ఫ్రూట్స్, పిండివంటలు, పూలతో వెంకటేశ్వర స్వామిని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

13 నుంచి జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు

కారంచేడు: మండలంలోని దగ్గుబాడు గ్రామంలో ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జోనల్ స్థాయి (ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, బాపట్ల) జిల్లాల స్థాయిలో పురుషుల వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు, నిర్వాహకులు కొల్లా వెంకట్రావు, గేరా రవీంద్రనాథ్ ఠాగూర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని అంబేడ్కర్ నగర్ గ్రౌండ్‌లో జరిగే పోటీల్లో పాల్గొనాల్సిన వారు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తమ పేరు, ఊరు, జిల్లా పేర్లు నమోదు చేసుకొని ఎంట్రీ ఫీజుగా రూ.999 చెల్లించాలన్నారు. విజేతకు ప్రథమ బహుమతిగా రూ 20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15116, తృతీయ బహుమతిగా 10116 నగదు బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు 91823 76991, 81068 86037 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

చినగంజాం: రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని ప్రిపేర్ సంస్థ ఆర్గానిక్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ ప్రతినిధి బృందా అన్నారు. ఆదివారం మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో ప్రిపేర్ సంస్థ ప్రతినిధి జాకబ్ ధర్మరాజు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రిపేర్ సంస్థ రైతులకు వడ్డీలేని రుణాలు కల్పిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని చేసేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిపేర్ సంస్థ ప్రతినిధులు ఎస్‌వీ రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, రైతులు నాగశ్రీను, పోతురాజులతోపాటు చినగంజాం, వేటపాలెంకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



అభ్యసన సామగ్రి అందిస్తున్న లైబ్రేరియన్ ధనమ్మ

చీరాల అర్బన్: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని లైబ్రేరియన్ డీ ధనమ్మ అన్నారు. ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని పోటీ పరీక్షలకు జరుగుతున్న సందర్భంగా ఉద్యోగార్థులు సత్వరమే స్పందించి అవసరమైన పుస్తకాలను ఆన్ డిమాండ్ పుస్తకంలో నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఎస్ఎస్సీ అకాడెమీ డైరెక్టర్ యర్రాకుల శ్రీనివాస్ యాదవ్ పోటీ పరీక్షలకు అవసరమైన అభ్యసన సామగ్రిని పాఠకులకు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో రిజిస్టర్‌లో పాఠకులు కోరిన పుస్తకాలు నమోదు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పవని భానుచంద్రమూర్తి, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి : పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం పొంపొందుతుందని సంతమాగులూరు లైబ్రేరియన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు.

పోలీసుల అదుపులో జూదరులు

అద్దంకి రూరల్/మేదరమెట్ల: పలుగ్రామాల్లో ఆదివారం పోలీసులు, సెబ్ అధికారులు పేకాట స్థావరాలపై దాడిచేశారు. అద్దంకి ఎస్సై సమందర వలి ఆధ్వర్యంలో మండలంలోని ధేనువుకొండ గ్రామంలో జరిపిన దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారినుంచి రూ. 1600, చక్రాయపాలెంలో సెబ్ అధికారులు జరిపిన దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారినుంచి రూ. 2520లను స్వాధీనం చేసుకున్నారు. కొరిశపాడు మండలం రాచపూడి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్సై నరసింహం అదుపులోకి తీసుకుని రూ.2100 వేలు స్వాధీనం చేసుకున్నారు.

రికవరీ చేసిన ఫోన్లు అందజేత



ఫోన్‌లు అందజేస్తున్న ఎస్సై

అద్దంకి రూరల్: తమ సెల్ ఫోన్‌లు పోగొట్టుకున్న వారు అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అద్దంకి ఎస్సై సమందర్‌వలి ఆధ్వర్యంలో రికవరి చేసి ఆదివారం నలుగురికి ఫోన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్నావారు తమ ఫోన్ పూర్తి వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో తెలియపరిచాలన్నారు.

అధికారులూ చెత్తను శుభ్రం చేయించరూ..



రోడ్డులో పడేసిన వ్యర్థాలు

బల్లికురవ: పోలీస్ స్టేషన్, వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయాలకు వెళ్లే రోడ్డులో ఇరువైపుల వ్యర్థాలను పడవేస్తున్నారు. దీంతో రెండు కార్యాలయాలకు వివిధ పనులపై వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ఆరంభంలోనే పశువైద్యశాల కూడా ఉంది. అక్కడ వ్యర్థాలు పడేస్తున్నారు. మండలంలోని 21 పంచాయతీలకు చెత్త నుంచి సంపద కేంద్రాలు మంజూరైనా బల్లికురవ, చెన్నుపల్లి, కొమ్మినేనివారిపాలెం, కొణిదెన, కొప్పరపాలెం, కొత్తూరు, కూకట్లపల్లి, పాత మల్లాయపాలెం గ్రామాల్లో నిర్మాణ పనుల ఊసేలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవతో చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.